క్లుప్తంగా

విశ్వరూప్ సారథ్యంలో ప్రజల్లోకి..

కపిలేశ్వరపురం: పినిపే విశ్వరూప్ సారథ్యంలో వైఎస్సార్ సీపీ కార్యకలాపాలతో ప్రజల్లోకి మరింత చురుగ్గా ముందుకు సాగుతామని ఆ పార్టీ నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జి యరమాటి వెంకన్నబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా విశ్వరూప్‌ను నియమించడం పట్ల వెంకన్నబాబు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జిల్లాలో విశ్వరూప్ వెంట నడుస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

పాత్రికేయులకు ఉచిత దంత వైద్య శిబిరం



ద్రాక్షారామలో పాత్రికేయులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ క్రాంతికుమార్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో భీమేశ్వర దంత వైద్యశాల అధినేత డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలోని పాత్రికేయులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వరల్డ్ హార్ట్‌డే ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దంత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అది గుండె జబ్బులకు ఏ విధంగా దారి తీస్తుందో వివరిస్తూ అవగాహన కల్పించారు. నోటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. అనంతరం 22 మంది విలేకరులను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో పనిచేసే అత్యాధునిక రోబోట్ ద్వారా నోటి స్కానింగ్ నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు. అనంతరం విలేకరులకు టూత్ పేస్టులు, మౌత్ వాష్‌లు, మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మ మర్రికి ఆదివారం భక్తుల తాకిడి అధికమైంది. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ధనమ్మతల్లిని దర్శించుకున్నారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మండలంతోపాటు కొత్తపేట, ఆలమూరు, అయినవల్లి, రావులపాలెం తదితర మండలాల పర్యాటకులు, భక్తులు ధనమ్మమర్రిలో సందడి చేశారు.

తడి, పొడి చెత్తను కార్మికులకే అందించాలి



హసన్‌బాదలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మహిళలు తమ ఇంటిలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త, పొడి చెత్తలుగా విభజించి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు హసన్‌బాద గ్రామ మహిళలకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా ఆదివారం గ్రామంలో వీధులన్నీ శుభ్రం చేయించారు. ఆదే విధంగా ఇంటింటికీ వెళ్లి పంచాయతీ, సచివాలయ సిబ్బంది చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులను నిర్మించాలి

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారులను వెంటనే నిర్మించాలని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల పరిషత్ వైఎస్సార్ సీపీ విప్ పలివెల మధు, వైస్ ఎంపీపీలు గుణ్ణం భానుప్రకాష్, సాకా శ్రీనివాస్ కోరారు. కపిలేశ్వరపురం- అంగర, అంగర-వెదురుమూడి, వెదురుమూడి- మండపేట ప్రధాన రహదారులు ఛిద్రమై అధ్వానంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గ కేంద్రమైన మండపేట, వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరం, కాకినాడ వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉండడంతో మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

రాష్ట్రపతికి హైవే బాధితుల అర్జీ

మామిడికుదురు: పాశర్లపూడిలో 2014 అలైన్‌మెంట్ ప్రకారం చేయవలసిన రోడ్డు నిర్మాణ పనుల్ని కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రలోభాలకు జాతీయ రహదారుల విభాగం రెవెన్యూ అధికారులు ఆశపడి అలైన్‌మెంట్ మార్చారని ఆరోపిస్తూ బాధితులు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు అర్జీ పెట్టుకున్నారు. రెండు మూడు కుంచాలు భూములు ఉన్న పేద రైతుల పొలాల నుంచి హైవే వేయడం అన్యాయం అంటూ విన్నపంలో పేర్కొన్నారు. తామంతా పేద రైతులమని మా స్థలాల నుంచి జాతీయ రహదారి వేస్తే పురుగుమందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రపతి వెంటనే దీనిపై స్పందించి పేదల గోడు వినిపించుకోవాలని, రోడ్డు నిర్మాణంలో అవకతవకలపై విచారణ జరిపించాలని అభ్యర్థించారు. గతంలో అర్జీ పెట్టుకున్న బాధితులు తాజాగా మరో అర్జీ పెట్టుకున్నారు.

ఆశల పల్లకీలో..

- మార్కెట్ కమిటీపై కూటమి నేతల కన్ను
- ఏ పార్టీకి దక్కుతుందో తెలియని పరిస్థితి
- మొదలైన ఆశావహుల హడావుడి



ఆర్.వెంకటగణేష్‌చౌదరి(తెదేపా)



ముప్పనపల్లి గణేష్ (జనసేన)



ఎ.శ్రీరామచంద్రమూర్తి (జనసేన)



మార్కెట్ కమిటీ కార్యాలయం

రామచంద్రపురం: కూటమి ప్రభుత్వ ఏర్పాటై వంద రోజులు దాటిన తరువాత రాష్ట్ర స్థాయిలో ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు నామినేటెడ్ పోస్టులను ప్రకటించటంతో నియోజకవర్గ స్థాయిలో కూడా నామినేటెడ్ పోస్టుల పందేరం మొదలైంది. ప్రభుత్వం తర్వలో నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్లను ప్రకటించనున్న నేపథ్యంలో అప్పుడే ఆశవాహుల హడావుడి మొదలైంది. అయితే ప్రస్తుతం ఒకే పార్టీ కాకుండా మూడు పార్టీలకు చెందిన కూటమి నేతలు ఉండటంతో ఎవరికి వారు తమ ప్రయత్నాలను మొదలు పెట్టారు. పెద్దల ఆశీస్సుల కోసం తమ ప్రయత్నాలను మొదలు పెట్టారు. రామచంద్రపురం నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక ఒక సవాల్‌గా మారుతుందనే చెప్పాలి. ఇటు సొంత పార్టీ నేతలతో పాటుగా అటు జనసేన నేతలు కూడా మార్కెట్ కమిటీ చైర్మన్‌పై ఆశలు పెట్టుకోవటంతో మంత్రికి అగ్నిపరీక్షగా మారింది. నియోజకవర్గంలో 25 ఏళ్లుగా ఒక సంప్రదాయం కొనసాగుతూ వచ్చింది. శాసనసభ్యుడిగా కాపు, శెట్టిబలిజ సామాజిక వర్గాలకు చెందిన తోట త్రిమూర్తులు లేదా పిల్లి సుభాష్‌చంద్రబోస్‌లు ఉన్నప్పుడు మార్కెట్ కమిటీ చైర్మన్లుగా కమ్మ సామాజిక వర్గానికి కేటాయించే వారు. పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మాత్రం ఓసారి క్షత్రియ సామాజికవర్గానికి చెందిన అడ్డూరి జగన్నాథవర్మకు చైర్మన్ గిరి దక్కింది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గత సంప్రదాయాలకు భిన్నంగా అప్పటి సీఎం జగన్ ఆశయ సాధనకు అనుగుణంగా నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ వర్గానికి చెందిన పండు గోవిందరాజుకు నాలుగేళ్ల పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చారు. ప్రస్తుతం టీడీపీ నుంచి కమ్మ సామాజికవర్గం నేతలు, జనసేన నుంచి కాపు సామాజికవర్గానికి చెందిన యువ నేతలు కన్నేశారు.

ఆశావహులెందరో..

మంత్రి సుభాష్ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మంత్రి పదవి కూడా దక్కింది. సభలు సమావేశాల్లో మంత్రి సుభాష్ తాను జనసేన వల్లనే గెలుపొందానని పలు మార్లు ప్రస్తావించటం జరిగింది. దీంతో టీడీపీ నుంచి గానీ, జనసేన నుంచి గాని మార్కెట్ చైర్మన్ గిరిని యువతకు ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో కాజులూరు మండలం నుంచి కీలకంగా వ్యవహరించిన కమ్మ సామాజికవర్గానికి చెందిన చుండ్రు వీర్రాజుచౌదరిని మంత్రి సుభాష్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇవ్వచూపినట్లు సమాచారం. అయితే ఆయన రాష్ట్ర స్థాయి పదవిపై కన్నేయడంతో చైర్మన్ పదవి వద్దని సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. టీడీపీ నుంచి కె.గంగవరం మండలానికి చెందిన రావిపాటి వెంకటగణేష్‌చౌదరి ముందంజలో ఉన్నట్లు పార్టీ నేతలు అంటున్నారు. రాష్ట్ర మంత్రి లోకేష్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే కాకినాడకు చెందిన ఒక ముఖ్య నేతకు గణేష్‌చౌదరి అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. అలాగే పార్టీ కష్టకాలంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా సేవలందించిన కడియాల రాఘవన్ కూడా కమ్మ సామాజికవర్గం నుంచి రేసులో ఉన్నట్లు తెలుస్తుంది. టీడీపీ నుంచి మహిళా కోటాలో కనుక వస్తే మండలంలోని కందులపాలెంకు చెందిన వైట్ల గజలక్ష్మి కూడా ఆశిస్తున్నట్లు తెలిస్తోంది.

జనసేన నుంచి గట్టి పోటీ

నియోజకవర్గంలో ఎమ్మెల్యే సీటును టీడీపీకి కేటాయించారు కాబట్టి చైర్మన్ పదవిని జనసేనకు ఇవ్వాలని ఆపార్టీ నేతలు అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తుంది. పార్టీ మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ సూచించిన వారికి చైర్మన్ పదవిని ఇవ్వాలని జనసేన యువ నేతలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఇద్దరు యువ నేతలు చైర్మన్ పదవి కోసం పట్టుపడుతున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో జనసేన నుంచి కీలంగా వ్యవహరించిన రామచంద్రపురం మండలం వెలంపాలెంకు చెందిన ముప్పనపల్లి గణేష్, మంత్రి సుభాష్‌కు అత్యంత సన్నిహితంగా ఉంటున్నారు. ఈయన చైర్మన్ పదవిపై కన్నేశారు. ద్రాక్షారామకు చెందిన సంపతి సత్యనారాయణ జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్‌కు అత్యంత సన్నిహితుడు. ఈయన కూడా తనకు చైర్మన్ పదవిని వస్తుందనే ఆశతో ఉన్నారు. కాజులూరు మండలం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి ఓటమి చెందిన జనసేన నేత డేగల సతీష్, అన్యం శ్రీరామచంద్రమూర్తి, బొండా వెంకన్నలు కూడా ఆశిస్తున్నారు.

ఆహార నియమాలతోనే మెరుగైన ఆరోగ్యం



గొల్లపాలెంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ మంచి ఆహార నియమాలు పాటించినప్పుడే మెరుగైన ఆరోగ్యాన్ని పొందగలుగుతారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గొల్లపాలెం పీఎస్ఎన్ మూర్తి కళాశాలలో ఆదివారం గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు ఎంవీవీ జగన్‌మోహన్, ఎస్.రత్నమానిక, పి.మౌనికదేవి, అభిలాష్, పి.శ్రావ్య తదితరులు ఈ శిబిరంలో పాల్గొని రోగులకు కంటి పరీక్షలు, సుగరు, బీపీ, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గొల్లపాలెం పరిసర గ్రామాల నుంచి సుమారు 500 మంది రోగులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదుకు తుది గడువు నేడే

రాయవరం: మండలంలో ఈ-పంట నమోదు శతశాతం పూర్తయినట్టు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. మండలంలో 14,555 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఈ-పంట నమోదును రైతులు పూర్తి చేసుకున్నారని, ఈకేవైసీ మాత్రం 91 శాతం మంది రైతులు మాత్రమే పూర్తి చేసుకున్నట్లు వివరించారు. సోమవారం సాయంత్రంతో పంట నమోదు, ఈకేవైసీకి గడువు ముగుస్తున్నందున రైతులు త్వరపడాలని ఆయన సూచించారు. పంట నమోదు చేసినప్పటికీ ఈకేవైసీ చేయించుకోకుంటే పంట నమోదు పూర్తి కానట్టేనని రైతులు గమనించాలన్నారు. పంట నమోదు చేయించుకోకుంటే మద్దతు ధర కోల్పోవడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రభుత్వం నుంచి వచ్చే పంట నష్టపరిహారం, పంటల బీమా వంటి సదుపాయాలను కోల్పోతారని ఆయన రైతులకు సూచించారు.

వరి పైరుకు ఆకు ఎండు తెగులు

ప్రస్తుతం వ్యవసాయంలో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆకు ఎండు తెగులు అధికంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ తెలిపారు. వరి పంటలో ఆకు ఎండు తెగులు అధికంగా గమనించామన్నారు. ఆకు ఎండు తెగులు (బీఎల్‌బీ) ఉన్న పొలాల్లో నత్రజని ఎరువులు పైపాటుగా వేయరాదన్నారు. పంట పొలాల్లో నీరు దిగే పరిస్థితులు ఉంటే ఉన్న నీటిని తీసివేసి, కొత్త నీటిని పెట్టుకోవాలి. ఈ విధంగా రెండు మూడుసార్లు చేయాలి. దీనివలన పొలంలో ఉండే బ్యాక్టీరియా ఉధృతిని తగ్గించవచ్చు. కాపర్ హైడ్రాక్సైడ్ 2.5 గ్రాములు, ప్లాంటామైసిన్ ఒక గ్రాము మందును లీటరు నీటికి కలిపి, ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పంట బాగా తడిచే విధంగా పిచికారి చేయాలన్నారు.

కల్వర్టుకు రక్షణ ఏర్పాట్లు చేపట్టాలి



మొగలిపాలెంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న కల్వర్టు

కాజులూరు: మండలంలోని మొగలిపాలెంలో పంటకాలువపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. గత 12 ఏళ్ల క్రితం పంచాయతీ నిధులతో అధికారులు ఈ కల్వర్టును నిర్మించారు. క్రమేపీ కల్వర్టు కింది భాగంలో మట్టి కరిగిపోయి కాలువలో కలసిపోవటంతో రహదారి కింది భాగం గుల్లగా మారింది. దీంతో ట్రాక్టర్, లారీ వంటి భారీ వాహనాలు ప్రయాణిస్తే కల్వర్టు విరిగిపోయి కూలిపోతుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు నల్లమిల్లి ఆదిరెడ్డి, ద్వారంపూడి శేషారెడ్డి, రామారెడ్డి తదితరులు కోరుతున్నారు.

క్రీడాకారుల జీవితాలతో ఆటలు

రామచంద్రపురం: ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.చెంగల్రాయుడు, జనరల్ సెక్రటరీ గన్నమని చక్రవర్తిలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అర్హులైన యువ క్రీడాకారుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకాల వెంకటేశ్వరరావు ఆరోపించారు. రామచంద్రపురం మండలం వెల్ల, తాళ్లపాలెం గ్రామ సచివాలయాల అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువీకరణ పత్రాలతో 17 మంది క్రీడాకారులకు అన్యాయం చేశారన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా అవి నకిలీ సర్టిఫికెట్లుగా అధికారులు ధ్రువీకరించారని వెంకటేశ్వరరావు తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గుడి, ఎరువుల దుకాణంలో చోరీలు



ఎరువుల షాపులో చోరీ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి సీసీ ఫుటేజీ

అంబాజీపేట: మండలంలో వరుస చోరీలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. అంబాజీపేటలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో కనకదుర్గమ్మ ఆలయంలోను, ఎరువుల దుకాణంలో చోరీలు జరిగాయి. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న తేలుగుంట్ల మాచరరావు (రాజు)కు చెందిన విజయలక్ష్మి ఏజెన్సీ ఎరువులు, పురుగు మందుల షాపుకు వెనుక ఉన్న గొడౌన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి లోపలకు ప్రవేశించి రూ.70 వేల నగదును అపహరించుకుపోయాడు. షాపులో ఉన్న క్యాష్ కౌంటర్‌లో నగదును గుర్తు తెలియని వ్యక్తి తీస్తున్నట్లుగా సీసీ ఫుటేజీలో నమోదయిందని షాపు యజమాని రాజు తెలిపారు. అలాగే షాపునకు కూత వేటు దూరంలో వీరభద్ర థియేటర్ సమీపాన ఉన్న విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం చోరీ గురైంది. గుడిలో ఉన్న ధర్మ డిబ్బీని పగలగొట్టి అందులో ఉన్న రూ.5 వేల నగదును అపహరించుకుపోయారు. చోరీ జరిగిన రెండు ప్రాంతాలను పోలీసులు పరిశీలించారు.

వరద బాధితులకు బాలుడి సాయం



సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.15వేల చెక్కును ఎమ్మెల్యే వేగుళ్లకు అందజేస్తున్న బాలుడు కిశాంత్ భాను

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన పోతుల కిశాంత్‌భాను అనే బాలుడు వరద బాధితుల సహాయార్థం విరాళం అందజేశాడు. రాయవరం సాయితేజ విద్యానికేతన్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న కిశాంత్ భాను తాను కిడ్డీ బ్యాంకులో పొదుపు చేసుకున్న రూ.15 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా అందజేస్తానని తల్లిదండ్రులు కావేరి, శ్రీనివాస్‌కు తెలిపాడు. దీంతో తల్లిదండ్రులు కిశాంత్‌భాను దాచుకున్న రూ.15 వేలను చెక్కు రూపంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు బాలుడి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, స్థానిక నేత సుంకవిల్లి గంగరాజు పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే పెద్ద మనస్సుతో ఆలోచించిన కిశాంత్‌భానును పలువురు అభినందించారు.

ముగిసిన శ్రీమద్రామాయణ ప్రవచనాలు



అంబాజీపేటలో శ్రీరామ పట్టాభిషేకం చేస్తున్న రవికుమార్ దంపతులు

అంబాజీపేట: గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీమద్రామాయణ ప్రవచనాలు ఆదివారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేకంతో ముగిశాయి. స్థానిక పెద్ద వీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఏసీ కల్యాణ మండపంలో ఈ నెల 22 నుంచి శ్రీమద్రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. గుంటూరు జిల్లా నంబూరు కాశీవన ఆశ్రమ ప్రవచన కర్త శ్రీనివాస రామానుజదాసు ప్రవచనాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ప్రవచనాల ముగింపు సందర్భంగా నిర్వాహకులు అప్పన రవికుమార్, రేవతి దంపతులు శ్రీరామపట్టాభిషేకం నిర్వహించారు. ప్రముఖ వేద పండితుడు సుసర్ల బుజ్జి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం రామానుజదాసు మాట్లాడుతూ శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించడం వల్ల శుభాలు జరుగుతాయని పేర్కొన్నారు. రామానుజదాసును నిర్వాహకులతో పాటు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పన వాసు, బాలాజీ, ప్రభాకర్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డుపై అక్రమ నిర్మాణం

రావులపాలెం: నిబంధనలకు విరుద్ధంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రావులపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కొందరు ఆదివారం అక్రమ షెడ్డు నిర్మాణానికి తెరతీశారు. రావులపాలెం నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి అయిన ఆర్‌అండ్‌బీ రోడ్డుపై స్థానిక పెద్ద ఆంజనేయస్వామి గుడి సమీపంలో కాలువ గట్టున ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా రోడ్డుపై ఈ షెడ్డును నిర్మిస్తున్నారు. అయితే ఇది తాత్కాలికంగా కాకుండా పటిష్టంగా ఐరన్ పైపులు, ఐరన్ రాడ్లతో వెల్డింగ్ చేసి రోడ్డుపై వేయడంతో, నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. అక్రమ నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా దీనిపై చర్యలు తీసుకోవడంతో పాటు షెడ్డు తొలగింపునకు కిందస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

ర్యాలి ఆలయ ఈవోగా రమణమూర్తి



ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ ఈవోగా బీహెచ్‌వీ రమణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ ఈఓగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య 5 సంవత్సరాలు పూర్తి కావడంతో కపిలేశ్వరపురం బదిలీపై వెళ్లారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

రైసు మిల్లర్ల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



ఆలమూరు: మండలంలోని మోదుకూరుకు చెందిన వ్యాపారవేత్త చుండ్రు శ్రీనివాస్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. గతంలో కొత్తపేట నియోజకవర్గ రైసుమిల్లర్స్ అసోసియేషన్‌లో కీలకంగా వ్యవహరించి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. దీంతో శ్రీనివాస్ సేవలను గుర్తించిన రైసుమిల్లర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గంలోకి తీసుకుని ఉపాధ్యక్షుడిగా కీలక బాధ్యతలను అప్పగించింది. శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

భౌభౌలతో జనం బెంబేలు

- గ్రామాల్లో వీధికుక్కల స్వైరవిహారం
- చిన్నారులు, వృద్ధులపై దాడులు
- కట్టడి చేయాలని కోరుతున్న ప్రజలు



రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

రాయవరం: రోడ్డుపై నడిచి వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. గ్రామ సింహాల స్వైర విహారంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శునకాలు సమూహాలుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తుండడంతో ఎప్పుడు, ఎక్కడ డాడి చేసి పీక్కు తింటాయోననే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. వృద్ధులు, చిన్నారులనే కాకుండా ప్రతి ఒక్కరిపైనా దాడి చేస్తున్నాయి. పాదచారులపైనే కాకుండా ఒక్కోసారి వాహనాల వెంబడి పరుగులు తీస్తూ వాహనచోదకులపై కూడా దాడులకు తెగబడుతున్నాయి.

గుంపులు గుంపులుగా..

వీధికుక్కలు ప్రస్తుతం గ్రామాల్లో వీర విహారం చేస్తున్నాయి. మనుషులపైనే గాకుండా పలుచోట్ల పశువుల మందలు, గొర్రెలు, మేకలపై కూడా దాడి చేసి పశు పోషకులకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నాయి. వచ్చేపోయే ద్విచక్ర వాహనదారుల వెంటపడుతున్నాయి. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే వారిపై, చిన్నారులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం ఏదో ఒక చోట శునకాల బారిన పడి పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు. వీధికుక్కల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ వాటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

పెరుగుతున్న బెడద

గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో శునకాలు ఉంటున్నాయి. వీటిని నియంత్రించే విషయంలో అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఎక్కడబడితే అక్కడ మాంసం దుకాణాలు వేస్తుండడం, వ్యర్థాలను రహదారులపై వేయడం, కుళ్లిన పదార్థాలు, ఇతర తినుబండారాలను తిని కుక్కలు వ్యాధుల బారిన పడుతున్నాయి. అనంతరం విచిత్రంగా ప్రవర్తిస్తున్నాయి. కుక్కల సంతతి నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేయించాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా జరగడం లేదు. దీంతో కుక్కల సంతతి రోజు రోజుకూ పెరిగిపోతోంది. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే సమస్యగా ఉంది. వాహనచోదకులు వెళ్లినా వారి వెంట పరుగెత్తి దాడి చేయడంతో వాటి బారి నుంచి తప్పించుకునే క్రమంలో పట్టుతప్పి వాహనచోదకులు గాయాల పాలవుతున్నారు. అలాగే అకస్మాత్తుగా కుక్కలు డివైడర్లపై నుంచి రోడ్లపైకి రావడంతో వాహనదారులు అయోమయానికి గురై కింద పడి గాయాలపాలవుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రులతో పాటు, పలువురు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.

ఇదీ పరిస్థితి

క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటుగా, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, మండపేట, కాజులూరు మండలాల పరిధిలో 120 గ్రామాలున్నాయి. రామచంద్రపురం ఏరియా ఆస్పత్రి, మండపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటుగా ఆయా మండలాల్లోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 714 మంది కుక్క కాటు బాధితులు నమోదయ్యాయి. మండలంలోని రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 438 మంది కుక్కకాటుకు గురయ్యారు. ఇంచుమించుగా ప్రతి మండలంలో కుక్కకాటు బాధితులున్నారు.

ప్రతి నెలా బాధితులు వస్తున్నారు



ప్రతి నెలా పదుల సంఖ్యలో కుక్కకాటు బాధితులు చికిత్సకు వస్తున్నారు. కుక్కకాటుకు గురైన వారు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ ఇంజక్షన్లు తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు వచ్చే అవకాశముంది.

– డాక్టర్ అనిరుధ్, పీహెచ్‌సీ, రాయవరం

చికిత్స తీసుకోవాలి



కుక్క కాటుకు బాధితులు వెంటనే చికిత్స తీసుకోవాలి. నాటు వైద్యాలకు వెళ్లకుండా, దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలి. కుక్కకాటుకు అవసరమైన యాంటీ రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, రామచంద్రపురం